రాబోయే తుఫాన్‌కు ముందున్న ప్రశాంతత నెలకొని వుందక్కడ.

పిన్‌డ్రాప్ సైలెన్స్ ..... !

ఎవరూ ఎవరితోనూ మాట్లాడటం లేదు.

క్షణాలు అత్యంత భారంగా గడుస్తున్నాయ్.

అక్కడున్న వారందరి చూపులూ మహదేవ్ శరీరానికి అతుక్కుని వున్నాయ్.

శిశిరం సమీపిస్తూ శిథిలమయి-- రాలిపోవటానికి సిద్ధంగా వున్న ఆకులా వుందతని దేహం.

అభిరాం ఇక చూడలేనట్లు ముఖం తిప్పేసుకున్నాడు.

భావరహితంగా వుంది మనస్విని. ఆమె కనురెప్ప సైతం మూతలు పడటంలేదు. తిరుపతి మౌనంతో నేస్తం కట్టినట్టు మాటా పలుకూలేకుండా మౌనంగా చూస్తుండిపోయాడు.

ఉన్నట్టుండి మహదేవ్ శరీరం కదలసాగింది. కడుపులో విపరీతమైన బాధని సూచిస్తూ రెండు చేతుల్నీ పొట్టకి అదుముకుని మెలికలు తిరిగి పోసాగాడు. దాంతో స్టాండ్ నుంచి వ్రేల్లాడుతూ అతని ఎడంచేతికి అమర్చబడిన ఫ్లూయిడ్ బాటిల్ కదిలి, నేలకి తాకి 'భళ్ళు'న పగిలిపోయింది.

తుళ్ళిపడి అటు చూశారందరూ.

బాధతో లుంగలు చుట్టుకుపోతున్నాడతను.

అభిరాం చటుక్కున లేచి అతని శరీరాన్ని నేలమీద పడిపోకుండా అదిమిపట్టుకున్నాడు. మనస్విని చేష్టలుడిగి అటే చూస్తోంది. డాక్టర్ని తీసుకురావటానికి సుడిగాలిలా బయటకు నడిచాడు తిరుపతి.

తన బాధని వ్యక్తపరచటానికి సైతం శక్తిలేనట్టు మహదేవ్ స్వర పేటికనుంచి ఒక్క చిన్న శబ్దం కూడా రావటంలేదు.

డాక్టర్‌తోపాటు ఆ గదిలోకి ప్రవేశించాడు తిరుపతి.

మహదేవ్‌ని క్షణకాలం పరీక్షించగానే డాక్టర్‌కి అతని బాధేమిటో అర్థమయిపోయింది. మరుక్షణం అతన్ని ఆ గదిలోనుంచి మరో గదికి తరలించారు.

ఆ గదిలో వున్న రేడియాలజిస్ట్ బేరియం ద్రవాన్ని మహదేవ్ గొంతులో పోశాడు.

మెల్లగా గొంతులోంచి కడుపులోకి దిగుతున్న ద్రవం ఫ్లోరోస్కోప్‌లో అన్ని అవయవాలనీ స్పష్టంగా చూపిస్తోంది.

అభిరాం, తిరుపతి ఒకమూలన నుంచుని చూస్తున్నారు. బేరియం ద్రవం మరింత కిందికి దిగింది. అదే సమయంలో మహదేవ్ శరీరంలోని 'అల్సర్'ని గమనించాడు డాక్టర్.

కరెక్టుగా అల్సర్ వున్న ప్రదేశాన్ని మార్క్‌చేస్తూ ఫోటోలు తీశాడు రేడియాలజిస్ట్. వెంటనే దాన్ని కరిగించే లేసర్ కిరణాలు అతని శుష్కదేహంలోని అల్సర్‌పైకి ప్రసరించాయ్.

ఫ్లోరోస్కోప్‌లో చూసుకుంటున్నాడు డాక్టర్, రేడియాలజిస్ట్‌లిద్దరూ! అల్సర్ మటుమాయమయింది. మరుక్షణం మహాదేవ్ శరీరం అబ్జర్వేషన్ రూంకి తరలిపోయింది.

*　　*　　*　　*　　*

ఏటవాలుగా పడుతున్న సూర్యకిరణం వరప్రసాదానికి మేలుకొలుపు పాడుతున్నట్లు మృదువుగా అతని చెక్కిలిని ముద్దాడుతోంది.

మెల్లగా లేచి కూర్చున్నాడు వరప్రసాదం. ఒక్కసారి వొళ్ళు విదిలించి చుట్టూ పరికించి చూశాడు. పెట్టెలాంటి చతురస్రాకారపు గుహది.

ఒక్కక్షణం అఘోరీ బాబాని మనసులో తలుచుకొని ముందుకు నడిచాడు. నీలం, గోధుమ, ఆకుపచ్చ వర్ణాలతో ఆ ప్రదేశమంతా మెరిసిపోతోంది.

ప్రకృతి అందాలు అతని ప్రయాణ వేగాన్ని తగ్గించకపోగా మరింత ఉత్సుకతని అతనిలో నింపి ముందుకు సాగనంపుతున్నట్టు నడుస్తున్నాడు విశ్రాంతి కూడా తీసుకోకుండా! అలసటనేది తెలియనట్టు!

అప్పటికి మిట్టమధ్యాహ్నం అయిపోయినట్టు సమయాన్ని సూచిస్తూ సూర్యుడు నడినెత్తిమీదకి చేరుకున్నాడు. అదే సమయంలో అతను చేరుకున్న ప్రదేశాన్ని తెలియచేస్తూ హిందీలో రాసున్న "తవాఘాట్" అన్న బోర్డు కనిపించింది.

మరికొంచెం ముందుకు నడిస్తే అక్కడ కనిపించిందో చిన్న దుకాణం.

వరప్రసాదం అక్కడికి చేరుకుని నీళ్ళతో ముఖం కడుక్కుని అక్కడ దొరికిన చుక్కారొట్టెలు, దుంపల కూరలతో పొట్ట నింపుకుని డబ్బులు చెల్లించాడు.

అతనికి సహకరించటానికా అన్నట్లు గుర్రాలని బాడుగకు యిచ్చే వాళ్ళు కనిపించాడు.

వరప్రసాదాన్ని వెనక కూర్చోబెట్టుకుని ముందుకు సాగిపోయాడు బాడుగవాడు. తొమ్మిది కిలోమీటర్ల దూరంలో వున్న 'సంగూ' అనే ప్రదేశానికి అతన్ని అరగంటలో తీసుకుపోయింది గుర్రం. ఆ వ్యక్తికి బాడుగ యిచ్చి మళ్ళీ కొంతదూరం నడిచాడు.

ముందుగా అతనికి తగిలింది సిర్కా! అక్కడ ఒక వ్యక్తి కనిపించాడు. గుర్రంతో ఉత్తర్‌ప్రదేశ్‌వాడిలా వున్నాడు. వరప్రసాదంవైపు ఆశ్చర్యంగా చూశాడు.

అతను మానస సరోవర్ దగ్గరున్న కైలాస పర్వతానికి వెళ్ళాలి అనగానే ముందు ఆశ్చర్యపోయాడు. అసలా సమయంలో మిలట్రీ జవాన్లే ఎక్కడా కనపడరు. అటువంటిది ఈ ముసలివాడికిదేం పిచ్చి అనుకున్నాడు. వరప్రసాదం డబ్బుతీసి అతని చేతిలో పెట్టాడు. లెక్కపెట్టుకుని ఆశ్చర్యపోయాడతను. వందరూపాయల నోట్లు పది!

"ఏక్ హజార్!" ఆశ్చర్యానందాలతో అనుకుని మౌనంగా అతన్ని గుర్రం ఎక్కించుకుని గాలా, మాల్వా, బుద్ధి, గంజి, కాలాపానీ (ఈ ప్రదేశంలో ఉన్న కాళీమాత ఆలయం దగ్గర్నించీ కాళీనది మొదలవుతుంది) నవిడాంగ్ సమీపంలోని పర్వత శిఖరాలపై మంచుతో ఏర్పడిన ఈ

దింపాడు. వరప్రసాదం ముందుకు నడుస్తుండగా అతను హిందీలో యిలా అన్నాడు-

“ఏ బాబూ! జరా సమాల్‌కే ఆగే జానా! చైనా మిలిట్రీ లోగ్ పకడ్‌లేగా నైతో” అన్నాడు.

“సమజ్‌గయా! ధన్యవాద్” అని ముందుకు నడిచాడతను.

* * * * *

అప్పుడే ఆ గదిలోకి వచ్చాడు డాక్టర్.

అభిరాం కళ్ళుమూసుకుని ఆలోచనల్లో వున్నాడు. తిరుపతి ఎక్కడా కనిపించలేదు. మనస్విని నిస్త్రాణంగా మహదేవ్ బెడ్‌మీద తలుంచి అచేతనంగా చైర్‌మీద కూర్చుంది. ఎదురుగా కన్పించిన దృశ్యం చూసి ఒక్క క్షణం నోటమాట రాలేదు డాక్టర్‌కి.

* * * * *

క్రమంగా వెలుగు పలచబడుతుంది. హృదయానికి మరింత ప్రశాంతత చిక్కుతున్న అనుభూతి .....

ఎప్పుడో చూసిన ఆ పరిసరాలు నిన్న మొన్ననే చూసినట్టు అనిపిస్తున్నాయ్ వరప్రసాదానికి.

గుర్రబ్బండివాడు హెచ్చరించినట్లు ఎవ్వరూ అతని మార్గానికి అడ్డురాలేదు.

“సమీపిస్తున్నాను ..... అఘోరీ బాబాని సమీపిస్తున్నాను” గొంతెత్తి పెద్దగా అరవాలనిపించింది అతనికి.

సరిగ్గా అప్పుడే జరిగిందా సంఘటన.

గాలి విసురుగా ఈడ్చి ఈడ్చి కొడుతూ ..... మంచుని పైకిలేపుతూ సుడులు తిరగసాగింది.

హోరుమంటూ రొద ..... చెవుల్లోని కర్ణభేరి పగిలిపోయేలా. వరప్రసాదం చుట్టూ చూశాడు.

తల దాచుకోవటానికి ఒక గుహకానీ నివాసయోగ్యమైన స్థలంగానీ కనిపించలేదు.

కనుచూపుమేరంతా దూదిలాంటి తెల్లని మంచే!

“అఘోరీ బాబా ..... అఘోరీ బాబా ..... ” ధైర్యం కూడగట్టుకుని ప్రార్థించాడు.

మరింత జోరు సంతరించుకుంది గాలి ..... క్రమంగా మంచు తుఫానుగా మారింది.

వరప్రసాదం మనోనిబ్బరం కోల్పోకుండా దృష్టినంతటినీ అఘోరీ బాబా మీదే నిలిపాడు.

చీకటి మరింత చిక్కనవుతోంది. అయినా నడుస్తూనే వున్నాడు అతను. గజగజ వణికిస్తున్న చలి. కళ్ళకి అడ్డంగా ఏమీ కనిపించనివ్వకుండా తెరల్లాపరుచుకుంటున్న కాటుకలాంటి చీకటి.

“బాబా! అఘోరీబాబా ..... కాపాడు ..... అర్ధాయుష్కుణ్ని చేయకు. నీ శక్తిముందు ఎవరూ నిలవలేరు. కాపాడు ..... మహదేవ్‌ని కా ..... పా ..... డు బాబా ..... బా ..... ”

కొండవాలు నుంచి పడిన పెద్ద మంచు తిప్ప వరప్రసాదాన్ని విసురుగా ఢీకొంది.

అతని మనసులో మాట పూర్తికాకుండానే అతను కోరుకున్నది జరగకుండానే ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

*      *      *      *      *

ఆ గుహలో అఘోరీ ధ్యానం చేస్తున్నాడు. కొన్ని క్షణాల్లోనే అతనికి అంతరాయం కలిగింది.

కళ్ళు విప్పి చూశాడతను. ఏమీలేదు. మళ్ళీ ధ్యానం మొదలుపెట్టి కనులు మూసుకున్నాడు.

అదే పరిస్థితి. మరుక్షణం అతని కళ్ళు ముసుకున్నాయి. మనోనేత్రం తెరుచుకుందా అన్నట్టు తన కోసం వరప్రసాదం రావటం, మార్గమధ్యలో అతను చనిపోవటం అంతా స్పష్టంగా తెలిసిపోయింది. ధ్యానం ముగించి లేచి నించున్నాడు.

ఒక్క ఉదుటున గుహ బయటికి నడిచాడతను. వరప్రసాదం అతన్ని చూసినప్పుడు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలానే వున్నాడు కాలాన్నీ, ప్రకృతినీ జయించిన దివ్య పురుషుడిలా.

గాలి, మంచు స్వైరవిహారం చేస్తున్నాయ్. అతను తిన్నగా ముందుకు సాగిపోతున్నాడు. క్రమక్రమంగా గాలీహోరూ తగ్గిపోయి ప్రశాంతత నెలకొంది.

ఆకాశానికి చెమ్కీలద్దినట్లు మిలమిలలాడుతున్న నక్షత్రాలు వేగంగా నడుస్తున్న అఘోరీ పాదముద్రలు చాలా పెద్దగా మంచుపై ప్రత్యక్షమై యతిని గుర్తుకు తెస్తున్నాయి.

తెల్లని మంచులోంచి నల్లగా బైటికి కనిపిస్తూన్న వరప్రసాదం కుడికాలి బూటు చీకటిలో కూడా గుర్తుపట్టి ఆగాడు అఘోరీ.

గబగబా మంచునంతటినీ చేతులతో తీసేశాడు. అప్పుడు పూర్తిగా బయటపడింది వరప్రసాదం శవం! ఏదో చెబుతున్నట్లు నోరు తెరుచుకుని వుంది. నోరు చెబుతుంది చెయ్యమన్నట్టు ఆశగా చూస్తున్న కళ్ళు ..... మంచుని తిరిగి కప్పేసి లేచి నిలబడ్డాడు. ఒకసారి ఆకాశంలోకి చూశాడు. ఏదో అర్థమైనట్లు తల పంకించి కుడివైపుకి తిరిగి చీకట్లో కలిసిపోయాడు.

*      *      *      *      *

గబగబా వెళ్ళి పరీక్షగా చూశాడు.

'మహదేవ పక్క తడుస్తుంది ..... అంటే మూత్ర విసర్జన నార్మల్‌గానే జరుగుతుంటుంది ..... కిడ్నీలు పనిచేస్తున్నాయ్.

నిశ్శబ్దంగా బయటికి నడిచాడు. అతనికి ఎనిమిదో ప్రపంచ వింతని చూసినంత ఆశ్చర్యం కలిగింది. 'బ్లడ్ టెస్ట్‌లో క్లియర్‌గా తెలిసింది కదా కిడ్నీస్ ఫెయిల్యూర్ అని. మరిదేమిటి?' అనుకున్నాడతను.

మళ్ళీ నర్సుతో పాటు అక్కడికి వచ్చి ఆమెకేదో చెప్పాడు. ఆమె మహదేవ్ చేతిలోంచి

సిరెంజి ద్వారా బ్లడ్ తీసుకుని లాబ్‌వైపు నడిచింది.

డాక్టర్ మహదేవ్ వంక ఓ వింత జీవిని చూస్తున్నట్లు చూసి బయటకు నడిచాడు.

చీఫ్ గదిలోకి నడిచి ఆ విషయమే చెప్పాడు. అతను విభ్రాంతిగా నోరు తెరిచాడు.

"బాడీలో ఎక్కడో ఏదో లోపముంది. ఇదీ అని చెప్పలేని వైరస్ లాంటిదా? లేక ఆర్గాన్స్ ఫంక్షనింగ్‌లోనా?" నుదురు మీద చిన్నగా కొట్టుకుంటూ అన్నాడు డాక్టర్.

* * * * *

మహదేవ్‌లో క్రమక్రమంగా జీవచ్ఛాయ తగ్గిపోతూ ప్రేతకళ వచ్చేసింది. చిన్నగా శ్వాస తీసుకోవటం తప్ప శరీరంలో మరే ఇతర కదలికలూ లేవు.

మనస్విని వైపు చూశాడు అభిరాం. ఆకాశంలో ఏదో కనిపిస్తున్నట్లు కిటికీలోంచి అటే చూస్తోందామె.

'ఈమెకి పిచ్చి వచ్చేస్తుందేమో మరికొన్ని రోజులకి అనుకున్నాడు. తిరుపతి ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

'వరప్రసాదం ఏమయిపోయాడు? ఎందుకు ఎవరికీ చెప్పకుండా అదృశ్యమైపోయాడు? ఇక్కడి పరిస్థితులకి తట్టుకోలేకా?

ఎవరి లోకంలో వాళ్ళుండగా మహదేవ్ శరీరం క్రమంగా నీలం రంగులోకి మారిపోతోంది.

అదే క్షణంలో నర్స్ అందించిన బ్లడ్ రిపోర్ట్ చూస్తున్నాడు డాక్టర్. కిడ్నీలు బాగానే పనిచేస్తున్నాయనేది దాని సారాంశం.

గబగబా మహదేవ్ దగ్గరికి నడిచాడతను. అతన్ని చూడగానే క్షణకాలం బిత్తరపోయాడు.

అతని శరీరంలో రక్తమంతా విరిగిపోయినట్లు నీలవర్ణంలోకి మారిపోయింది బాడీ.

'ఎందుకిలా జరుగుతుంది? ఎందుకని జబ్బుని తెలుసుకోలేకపోతున్నాను?' దీర్ఘంగా నిట్టూర్చాడు.

* * * * *

ప్రళయం రాబోతుంది అన్నదానికి సూచనగా నల్లటి మేఘాలు కమ్ముకొస్తున్నాయ్. గుండెలవిసిపోయేలా తీతువు అరుస్తోంది.

గాలి ఉధృతం పెరిగింది. పుర్రెలలోకి గాలిదూరి పిశాచాలు రోదిస్తున్నట్లుంది. ఎవరో ఏడుస్తున్నట్లు- అంతలోనే నవ్వుతున్నట్లు పరస్పర విరుద్ధమైన ధ్వని తరంగాలు.

పక్షులు భయంతో టపటప రెక్కలాడిస్తూ తమ గూళ్ళు విడిచి ఎగిరిపోయాయి. చితిలో కాలుతున్న శవంలోని కనుగ్రుడ్లు 'ఢన్' మని పేలిన శబ్దం. గుడ్లగూబ గుడ్లురిమి చూస్తోంది.